

# వినవేడుక

ఇచ్ఛాపురపు రామచంద్రం

"బాబూ "

చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి అటు చూశాను. ఒక నిముషంపాటు కళ్లు తిప్పుకోలేకపోయాను. నల్లరాతిలో మలచిన గ్రీకు శిల్పం పోతపోసిన యినుప విగ్రహం. జీవం ఉట్టిపడుతున్న శిల్పంలాటి మనిషి... గుండెలు పొంగి... కండలు తిరిగి మనిషంటే నేను, ఆరోగ్యమంటె నాది అన్నట్లున్నాడు.

"శర్మగారంటే తమరేనా అయ్యా?"

"ఊఁ." తల ఊపాను, అతన్ని ఆపాదమస్తకము చూపులతో ముంచెత్తుతూ.

"మాది హరిపాలెమండి. చలం పంతులుగారు పంపారండి " అంటూ మొలలోంచి ఓ కాగితం మడత తీసి అందించాడు. హరిపాలెమంటే చలపతే. ఉత్తరం అందుకున్నాను. ఆత్రంగా చదవసాగాను.

"శర్మా!

క్షేమం. మీరంతా క్షేమమని తలుస్తాను. ఆ మధ్య మాటల్లో అన్నావు- మంచి పనివాడుంటే పంపమని. అది పురస్కరించుకుని- అప్పన్నని పంపుతున్నాను. నీ అవసరం తీరాక పంపు. తొందరలేదు. అన్నట్లు- వీడికి పట్నం చూడాలని మహా ఉబలాటం. నేనో పదిహేను రోజుల్లో వస్తాను. విశేషాలు లేవు. శలవ్.

చలపతి."

ఉత్తరం ముగించి-చూశాను. గేటు దగ్గర అంతవరకూ ఉంచిన గోనెమూట

నవలీలగా ఎత్తి భుజానవేసుకున్నాడు. పార మోచేతికి తగుల్చుకుని గునపము చేతిలోకి తీసుకువి - వరండా వద్దకు వచ్చాడు.

"బుగతగారు నెయ్యీ కాయగూరలూ తెలకపిండీ పంపారు తమకి. లోన పెట్టేదా?"

"రాజా...." అబ్బాయిని పిలిచి తోవ చూపమన్నాను.

ఆ మధ్య - చవకలో వస్తుందని ఓ పాతయిల్లు కొన్నాను. పెరట్లో పెద్ద పెద్ద చెట్లు. బండరాళ్లు. చెట్లుకొట్టి.... రాళ్ల పెకలించి.... గదిలో మెట్లు పగల గొట్టి.... యిలాటి బండపనులు చాలా చేయాలి. అప్పుడు తప్ప యింటికొక రూపం తీసుకురావడానికి వీలవదు. రీ మాడలింగ్ కుదరదు. ఆ మాటే అన్నాను చలపతితో క్రిందటిసారి అతనిక్కడికి వచ్చినప్పుడు. మరచిపోకుండా - తగిన వాడినే పంపాడు.

శరీరకష్టంచేస్తూ - బలవర్ధకమయిన తిండి తింటున్నందున అప్పన్న వొంటి మీద వయసు కనపడడంలేదు కానీ నలభయ్యయిదుకి పైచిలుకే ఉంటుంది. వయస్సెంతయితే నేం, చెయ్యవలసిన పనికి ఉండదగిన మనిషి చాలు.

"ఏటేటి చెయ్యాలో ఒక్కపాలి చెప్పెయ్యండి బాబూ...." అంటూ వచ్చాడు అప్పన్న.

"ఎండగా ఉంది. ఇవాళ విశ్రాంతి తీసుకుని రేపు పొద్దున్న మొదలుపెట్ట కూడదూ?"

"ఇదో ఎండా:....మా బోంట్ల కెండా, కొండా ఏటి బాబూ? ఒక్కపాలి తమ రొచ్చి ఏకేటి చెయ్యాలో చెప్పెళ్లండి చాలు."

తప్పదనుకుంటూ బద్ధకంగా లేచి - వెళ్లిచేయవలసినవి చెప్పివచ్చాను. ఐదు నిముషాల ఎండకే నీరసంవొచ్చి గ్లాసెడు షర్బత్ తాగితే తప్ప తేరుకోలేక పోయాను.

సాయంత్రం ఔతోంది.

రాజావచ్చి- "అప్పన్న బలేవాడండి. అప్పుడే ఎంతపని చేసేశాడో!" అన్నాడు. వెళ్లాను. అప్పన్న నూతిదగ్గర స్నానం చేస్తున్నాడు. సాయంత్రపుటెండలో నీరు పడుతున్న అతని శరీరం పాలిష్‌చేసిన రోజ్‌వుడ్ శిల్పంలా మెరుస్తూంది. అసూయ వేసిందెందుకో నాకు. పెరటివేపు చూశాను. మహావృక్షాలు మచ్చుకయినా లేవు. అవి అంత త్వరగానూ సులభం గానూ వొదులుతాయనుకోలేదు. పెరటికి కొంత రూపం వచ్చింది. సంతోషించాను మనసులో.

"అప్పన్న - సినిమాకి తీసుకెళ్ల మంటున్నాడు." జాలిపడుతున్నట్లన్నాడు రాజా.

"ఒక్కడూ వెళ్లలేడూ?" పర్సు తీస్తూ అడిగాను.

"ఏమో.... నన్నూ రమ్మన్నాడు.

పల్లెటూరువాడుగా.... ఏమీ తెలియదేమో...."

"సరే. వాడిని బెంచీకి పంపి నువ్వు కుర్చీకి వెళ్లు."

"అలాగే." డబ్బు తీసుకుని వెళ్లిపోయాడు రాజా.

నాకు చాలా ఆనందంగా ఉంది. గర్వంగా ఉంది. మా నాన్న నాకేమీ మిగల్చలేదు. కాని నేను నా ప్రయోజకత్వంతో నా కొడుకుకోసం మంచియిల్లు సిద్ధంచేయబోతున్నాను. అది చాలా తృప్తిగా ఉంది నాకు.

వాళ్లు సినిమానుంచి వొచ్చేవరకూ నేనూ భోజనంచేయలేదు. రాజాతో కలిసి రాత్రి భోజనంచేయడం నా కలవాటు. రాజాకాక నా కెవరున్నారని?

"అప్పన్న చిత్రమైనవాడు!" అంటూ నవ్వాడు రాజా.

"ఏం?"

"ఇద్దరమూ ఒకేచోట కూర్చుందామని ఏడ్చినంత పనిచేశాడు."

"ఐతే – నువ్వు బెంచీకి వెళ్లావా?" ఆత్రంగా అడిగాను.

"లేదు. వాడికీ కుర్చీటికెట్ తీశాను."

"గుడ్! మంచిపని చేశావు. ఐతే అప్పన్న వొట్టి భయస్తుడన్నమాట!"


"కాదులెండి."

"మరి?"

"వాడి బుర్రనిండా సందేహాలూ, ప్రశ్నలే. ఎవరూలాగకుండా తెర ఎలా లేస్తుంది.... బొమ్మ ఎలా పడుతుంది.... మాటలూ పాటలూ ఎలా వొస్తాయి.... ఎన్నెన్ని అడిగాడో!.... ఇంటర్వెల్‌లో ప్రొజక్షన్‌రూమ్ చూపించాను. వెర్రివాడు, హాలంతా కలియదిరిగాడు.... లెట్రిన్లూ, యూరినల్సూ.... కుళాయిలు కూడా చూసివచ్చాడు...." నవ్వాడు రాజా

ఆశ్చర్యమూ అనుమానమూ వేశాయి. ఎంత పల్లెటూరి రైతయినా అప్పన్న వయసు కేవిధమయిన కుతూహలం అసహజమే. బొమ్మెలా పడుతుంది, మాటలూ పాటలూ ఎలా వస్తాయనేవి– ఎండలో అద్దంపెట్టి ఇంట్లో భూతద్దం సినిమా వేసుకునే అబ్బాయిలకే కుతూహలం కలిగిస్తాయి. ఐదుపైసల ఐస్‌క్రీమ్ ఐదేళ్ళ కుర్రాడికేకాని ఐదుపదుల వాడి నాకర్షించదే సాధారణంగా! అప్పన్నకి ఎన్‌టిఆర్ ఫైటింగో జ్యోతిలక్ష్మి డాన్సో వినోదం కలిగించాలి తప్ప బొమ్మెలా పడుతుందన్న ఆలోచన దేనికి? రంభ – పసివాడికి పాలతల్లిగా అనిపించాలి. వయసువాడికి వలపుకత్తెగా కనిపించాలి. అటునుంచిటయితే ఏదో తిరకాసుందన్నమాటే విస్పందేహంగా. ఏమిటో అది?

మర్నాడు సాయంత్రం.... ఆఫీసు నుంచి వచ్చేసరికి అప్పన్నా లేడు అబ్బాయీలేడు. "ఎక్కడికి వెళ్లారు?" అడిగాను శ్రీమతిని కాఫీకప్పు తీసుకుంటూ.



"తెలియదు.— పెరటిపని దాదాపు పూర్తిచేసేశాడు. చూసొస్తారా?"

"అక్కర్లేదులే." కాఫీతాగి సిగరెట్ అంటించి "ఎలిన్" నవలందుకున్నాను. ఒక్కసారి ఆలోచన — రాజాగురించి. వాడికన్నీ అమర్చాలి. దేనికీ లోటు చెయ్యకూడదు. మంచి చదువు.... ఆస్తి అన్నీ అమర్చాలి. గొప్పవాడిని చెయ్యాలి. రాజాతప్ప నాకెవరున్నారు?

గేటుచప్పుడు — విని అటుచూశాను.

ముందు రాజా, వెనుక ముణుకుల వరకూ పంచె.... మోచేతులవరకూ చొక్కాతో అప్పన్న.

"ఇవాళా సినిమాయేనా?"

"కాదు. షికారు. షికారేమిట్లెండి.... తెగతిరిగాం." అలసినట్లు నిట్టూర్చాడు.

"నడకే?"

"అప్పన్న రిక్షా వద్దంటాడు. నడిచయితేనే చాలా చూడవొచ్చునట."

"బాగుంది. ఏమేం చుట్టబెట్టారు?"

"మార్కెట్.... పోర్టు.... చల్ల హోటలు.... అదే.... ఎయిర్ కూల్డ్ హోటలు....నడవడం ఒకెత్తూ అతని ప్రశ్నలకు జవాబులుచెప్పడం ఒకెత్తూ—" నిట్టూర్చాడు రాజా.

వాడి ముఖంలోకి చూశాను వివరంగా చెప్పమన్నట్లు.

"సముద్రాన్నీ ఓడలనీ చూస్తూ చిన్న

పిల్లవాడిలాగే గంతులేశాడు. అంత పెద్ద బరువైన ఓడలు నీటిలో మునిగిపోవేం, చిన్న రాయే మునిగిపోతుంది కదా? మార్కెట్లో రోజూ అన్నేసి సామాను లెవరు కొంటారు? కరంటు ముట్టు కుంటే మాడి మసయిపోతారు కదా ఆ కరెంటుతో గదులెలా చల్లబడతాయి? ఇలాగే. ప్రశ్నలు ప్రశ్నలు."

"ఓడెక్కుతా ననలేదూ?"

"ఊహుఁ"

"అప్పన్న ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పావా?"

"ఓ! జనరల్ నాలెడ్జి పుస్తకాలు బాగా చదువుతున్నానుగా."

"గుడ్!" అభినందించాను. "చాలా అలిసిపోయావు. త్వరగా పడుకో."

"ఊఁ" అన్నాడే కాని పడుకోలేదు. అప్పన్నతో కబుర్లకి దిగాడు. రేడియో, టేప్‌రికార్డరు, టి.వి. వీటి గురించి రాజా చెబితే పొలాలు ... పంటలు.... ఎద్దుల బండి.... నాగళ్ళు.... వీటి గురించి అప్పన్న చెప్పాడు. ఏ గూటిచిలుక ఆ గూటి పలుకే పలుకుతుంది మరి.

మరునటి రాత్రి—

"అప్పన్న యిస్కూలూ, ఇస్టేషనూ అంటాడేం?" అడిగాడు రాజా.

"హిందీ మాట్లాడేవాళ్లూ పల్లెటూరి వాళ్లూ కొందరలా అంటారు. ఇవాళ ఏమేం చూపించావు?"

"ఇస్కూలూ.... యిస్టేషనూ ...." నవ్వి—"స్టేషను గురించి పెద్ద ప్రైవేటు చెప్పాను.

ఇంజన్ నుంచి గార్డు పెట్టెవరకూ ఏదీ వదలకుండా చూశాడు. సీట్లు.... బెర్తులు. లెట్రిన్‌లు....వాష్‌బేసిన్లు.... అలారం గొలుసు.... అన్నీ తడిమి చేశాడు. రైలు పట్టాలమీదెలా పరు గెడుతుంది. ఎలా ఆగుతుంది? రైళ్లెం దుకు గుద్దుకోవు? ఏ రైలెక్కడికి వెళ్తుందో ఎలా తెలుస్తుంది? ఒక టే మిటి...లక్ష ప్రశ్నలు....యక్షప్రశ్నలు వేశాడు. చెప్పాను." అన్నాడు.

"మంచి పని చేశావు."

"హైస్కూలుకి తీసుకెళ్లి గ్రౌండూ, క్లాసు రూములూ చూపించాను. వివరిం చాను."

"ఎవరయినా చూచి నవ్వలేదు కదా!"

"ఏమో. నేను గమనించలేదు."

ఇక నేనొక నిశ్చయానికి వొచ్చే శాను. అప్పన్నకి— వయసయితే వొచ్చింది. శరీరమూ ఎదిగింది. మనస్సు పరిణతి చెందలేదు. వయసుకి తగ్గట్లు మెదడెదగలేదు. ప్రిమెచూర్ అడల్టీ నెస్‌లా ఇదీ ఓ జబ్బే. మానసిక అపరి పక్వత. నలభై దాటిన మనిషికీ కుతూ హల మేమిటి, రైలూ బస్సూ చూసి ముచ్చటపడడమేమిటి?

"అన్నట్లు అప్పన్నని అంతస్తుల బస్సెక్కించి ఏరొడ్రోమ్‌కి తీసుకెళ్లాను. ఓ ప్లేన్ లాండింగూ, మరో ప్లేన్

ఠీకాపూ చూశాడు. ఎగిరి గంతులు వేశాడు. విమానం ఎలా ఎగుర గలుగుతూంది? ఎందుకు పడిపోదు? అకాశం అంతా ఒకేలా ఉంటుంది కదా తోవెలా తెలుస్తుంది? ఎక్కడ దిగాలో ఎలా తెలుస్తుంది? ప్రశ్నలు ప్రశ్నలు...."

"ఊఁ." అన్నా నన్యమనస్కంగా.

మరో రెండు రోజులు గడిచాయి.

"అప్పన్న రేపు వెళ్ళిపోతాడట_"

బాధగా దిగులుగా వినిపించిందామాట. ఉన్న అరేడు రోజులలోనూ అన్ని పనుల లోనూ తానే అయ్యాడు. శ్రీమతికి నీళ్ళు తోడి బట్టలుతకడమూ .... బాత్ రూమ్‌లో నీళ్ళు పెట్టడం .... ఒకటేమిటి అన్నీ చేసేవాడు. అసహ్యంగా అతి భయంకరంగా ఉండే పెరటికి అకారం, అందం తెచ్చాడు. నేనేమేమి చేయించాలనుకున్నానో అన్నీ అద్భుతంగా పూర్తి చేసేశాడు. నిజంగా చాలా మంచివాడు. నోరులేనివాడు. అతి మంచివాడు. అమాయకుడు. అందుకే అతి స్వల్ప కాలంలోనే యింట్లో ఒకడులా అయిపోయాడు. వాడు వెళ్ళిపోతే శ్రీమతికి చెయ్యి విరుచుకున్నట్లే ఉంటుంది.

ప్రొద్దున్నలేచి_ కాఫీ తాగి_ సిగరెట్ అంటించి_ పేపరు చదువుతున్నాను.

"బాబూ!" అప్పన్న కంఠం. "నేను వచ్చిన పనయింది. శెలవిప్పించండి బాబూ." చేతులు జోడించాడు.

మరో రెండు రోజులుండమన్నా వాడేమన్నా పని మిగిల్చితే కద?

"ఒక్క నిముషం...." లోపలికి వెళ్లాను. పర్స్ తీశాను. రాజా_కిటికీ లోంచి జాలిగా అప్పన్న వేపు చూస్తున్నాడు. శ్రీమతి వచ్చింది గదిలోకి.

"అప్పన్నకెంతిస్తే బాగుంటుందంటావు?"

"ఎంతిచ్చినా తక్కువే. పెరడద్దంలా చేశాడు. అన్ని పనులూ చకచకచేశాడు."

"సాయంత్రం షికారు వెళ్లాలని_ ఎండవేళ పనిచేశాడు. ఔనా?"

"ఊఁ. వాడికో మాట చెప్పి చూడండి_ యిక్కడుండి పొమ్మని. వెళ్లక తప్పదంటే ఓ యాభై యివ్వండి."

డబ్బుపట్టుకుని వరండాలోకి వచ్చాను.

"చక్కగా చేశావు. ఇది ఉంచు అప్పనా! ఇక్కడే ఉండిపోకూడదటోయ్?" లౌక్యంగా అన్నాను.

"వారం పనికి యింతెందుకు బాబూ? అమ్మగారన్నపూర్ణమ్మగారిలా రెండు పూటలా వరన్నం పెట్టారు. అబ్బాయిగారు విసుక్కోకుండా ఊరు చూపించాడు...."

"మేమేమీ ఎక్కువివ్వలేదులే. ఉంచు మరి_యిక్కడుండి పోతావా?"

"ఎట్టా కుదుర్తది బాబూ? అదమనిషీ బుడ్డోడూ అక్కడ...."

వాడి కుటుంబాన్నంతటినీ పోషించడం మాకు తలకు మించిన భారం.

"టౌనులో పనిచేస్తూ బాగా సంపాదించుకుంటావు. వింతలూ విశేషాలూ

చూస్తావు. వారానికో నెలకో యింటికెళ్ళి పెళ్లాం పిల్లల్ని చూసొస్తావు."

స్వార్ధం కొద్దీ ఆశపెట్టాను.

"ఉండవో అప్పన్నా.... ఎగ్జిబిషనొస్తుంది. రంగులరాట్నం మెక్కుద్దాం"

"ముసిలోణ్ణి. నాకెందుకు బాబూ అవన్నీ?"

తెల్లబోయాను ఆ జవాబుకి. నాతో పాటు రాజా కూడా ఆశ్చర్యంగా చూశాడు.

"మరి యిన్నాళ్లూ టౌనులో ఒక్కటీ వదలకుండా అన్నీ చూశావే!?"

థాంక్యూ రాజా అనుకున్నాను. ఆ ప్రశ్న-కుర్రవాడు కనుక రాజా వేస్తేనే సమంజసంగా ఉంటుంది. నేనడగడం ఎంత మాత్రమూ సమంజసంగా ఉండదు.

"అవన్నీ నాకోసం కాదు చినబాబూ"

"మరి?"

"మా వూళ్లో నాకో బుడతడున్నాడు. పదేళ్లుంటాయి. బలే చలాకిగుంటాడు. కడుపునిండా కబుర్లే. వాడీడువాళ్ల పట్నంవెళ్లొచ్చి సినేమా చూశామనో, పొగబండెక్కామనో, సముద్రంలో తానమాడామనో చెబుతూంటే వింటాడు. రాత్రి నా పక్కలో చేరి సినేమా అంటే ఏటి? పొగబండి పడిపోకుండా ఎలా పరుగెడతాది? సముద్రమెంతుంటిది? అంటూ ప్రశ్నలేస్తాడు. జవాబు చెప్పే వరకూ కాల్చుకు తింటాడు. నేను చెబుతూంటే ఎంత శ్రద్ధగా వింటాడు! వింటూ పడుకుండిపోతాడు. వాడికి చెప్పడానికిగానీ అరవయ్యో యేట అగ్గిగండమని యిన్నేళ్లొచ్చి నా మొకానికింతా సరదాలూ సంబరాలూనా!" కళ్లు తుడుచుకున్నాడు.

"నీ కొక్కడే కొడుకు?"

"కొడుకయినా కూతురయినా ఒక్కడే. వాడి పేరు నూకరాజు."

ఒక్కసారి నాకు అప్పన్న మీద అనుమానం వేసింది. కొడుకుపేరు చెప్పి తను సరదాలు తీర్చుకోడంలేదు కద?


"నువ్వెంత బాగా చెప్పినా - చెవికీ కంటికీ మధ్య ఎప్పుడూ దూరం ఉండనే ఉంటుంది. వినడం వేరు, స్వయంగా కళ్లతో కనడం వేరు. మరో నెలలో యింటిపని మొదలుపెడతాను. అప్పుడు ఉత్తరం వేస్తాను. మీ వాడిని వెంటపెట్టుకురా."

ఒక్కసారిగా అప్పన్న కళ్లనిండా నీళ్లు.

వాడంత బాధపడడానికి నేనేం పరుషపు పలుకు పలికేను? ఆ కుర్రవాడి చేత కూడా పనిచేయిస్తానని బాధపడుతున్నాడా?

"కండక్టరు కొడుకు కలెక్టరౌతున్న యీ రోజుల్లో - మీ అబ్బాయిచేత కూలిపని చేయించాలని కాదోయ్ నిన్ను వెంటబెట్టుకు రమ్మన్నది వాడు పట్నం చూస్తాడని, అంతే."

"ఎంత దొడ్డ మనసు బాబూ మీది!" నమస్కారం పెడుతూ అన్నాడు.




"వాడు చూడలేడు బాబూ.... ఏమీ చూడలేడు. గుడ్డివాడు. ఊహాయితే ఉంది. ఊసులయితే వినగలడు. చూపు మాత్రం లేదు. అందుకే – నేను చూసి చెప్పడం– వాడు వినడం. వాడికి చెప్పడానికే నేను చూడడం." దుఃఖం ఆపుకోలేక భోరుమన్నాడు.

హృదయవిదారకమైన కథ– స్పష్టంగా, విపులంగా.... అర్థమయ్యేసరికి– జాలితో నా మనసు మూగవోయింది. ఒక్కగానొక్క కొడుకు– గుడ్డివాడు. ఏ తండ్రికయినా యిది తీరని శాపమే. అప్పన్నని కలతపడవద్దని ఊరడించడానికయినా మాటలు పెగల లేదు నాకు.

కొన్ని కథలంతే, మొదలంతా మామూలుగా ఉండి చివరకు దారుణంగా ముగుస్తాయి గుండెల్లో జ్వాలలు రేపుతూ. ఆ ముగింపు విన్నాక విన్నవారి హృదయం భారమై... మెదడు శూన్యమై .. గొంతు మూగవోయి – ఆ భావంలోనూ అయోమయావస్థలోనూ మిగిలిపోవలసిందే. అప్పన్న జాలిగాథ అంతే – కనీసం నా మేరకు.

అతను వెళ్ళిపోతున్నాడు– భారంగా, దీనంగా, దిగులుగా.